## క్లుప్తంగా

### నేడు విద్యుత్ అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని జన్కాపూర్‌లో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ లక్ష్మీరాజం ఓ ప్రకటనలో తెలిపారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల బిగించేందుకు కొత్త లైన్ పనులు దృష్ట్యా సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

### ఆలయంలో పూజలు



హారతి తీసుకుంటున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నుంచే కాక పక్క జిల్లాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి ఒడిబియ్యం, పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. పలువురు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు దేవార వినోద్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

### క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, సీఐ

జైనూర్: గ్రామీణ ప్రాంత క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్, సీఐ రమేశ్ పేర్కొన్నారు. మండలంలోని దేవుగూడ గ్రామంలో ఆదివారం వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడినవారు నిరుత్సాహం చెందవద్దని సూచించారు. ప్రతి ఒక్కరు చదువుతోపాటు క్రీడల్లో సత్తాచాటాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నతంగా చదివి ఉజ్వల భవిష్యత్తుకు పాటు పడాలన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, మాజీ సర్పంచి జాలీంషావు, నాయకులు పెందూర్ ప్రకాశ్, కోట్నక దౌలత్‌రావు, సుద్దాల ఆనంద్, కాశీరాం, నాయకులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలతో సిర్పూర్(టి) విద్యార్థులు

సిర్పూర్(టి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని ఆర్యవైశ్యభవన్‌లో జిల్లా కరాటే స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో సిర్పూర్(టి) మండల కేంద్రానికి చెందిన ఎస్ఆర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు, వెండి, కాంస్య పథకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సంతోష్ తెలిపారు. 17 మంది విద్యార్థులు బంగారు పతకాలు, 7గురు (వెండి), 8 మంది (కాంస్య) పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, స్థానికులు వారిని అభినందించారు.

### క్రీడల్లో గెలుపోటములు సహజం



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని భట్‌పల్లి పంచాయతీలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంప్రసాద్, ఆవుల రాజ్‌కుమార్, అంజన్న, రాఘులయ్య, రమేశ్, సత్తి, చరణ్‌దాస్, రమ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కెరమెరి: వన్యప్రాణుల రక్షణతోపాటు పులుల సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్వో మజారొద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వారసంతలో ఆయన అడవుల సంరక్షణ, వన్యప్రాణుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వన్యప్రాణులను వేటాడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఎఫ్‌బీవో రామయ్య ఉన్నారు.

# కంకరతేలి.. గుంతలు పడి

రోడ్డు బాగాలేకపోవడంతో నడక నరకప్రాయంగా మారింది. ఎక్కడికక్కడ కంకరతేలి దర్శనమిస్తోంది. వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇటీవల ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో రోడ్డు మరమ్మతు చేస్తే బస్సు వచ్చే అవకాశం ఉంటుందని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

- అధ్వానంగా లేండిగూడ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



మూలమలుపు వద్ద తేలిన కంకర



కెలికే వద్ద ఉన్న కల్వర్టు పరిస్థితి

కెరమెరి: గత ప్రభుత్వంలో అనేక గ్రామాలకు రూ.లక్షల నిధులు వెచ్చించి తారు రోడ్డు నిర్మించింది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గమైన లేండిగూడ రోడ్డు నిర్మాణంపై ఇటు అధికార యంత్రాంగం దృష్టి సారించలేదు. ఫలితంగా లేండిగూడ, గౌరి, భోలాపటార్, అంతాపూర్, పద్మావతి, ఏసాపూర్, నారాయణగూడ తదితర గ్రామాల్లో వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. నడక నరకప్రాయంగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో సుమారు 2 వేలకు పైగా జనాభా ఉంటుంది. కాగా, ఇదే రోడ్డు మార్గాన మహారాష్ట్రలోని జివితి, గడ్‌చందూర్, కొర్పానా తాలుకాలకు వెళ్తున్నారు. ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాలు రాకపోలు సాగిస్తున్నాయి. కోర్పనాలో జిన్నింగ్ మిల్లులో పత్తి పంట విక్రయించేందుకు కెరమెరి నుంచి వాహనాలు వెళ్తున్నాయి.

**కంకరతో ఇబ్బందులు**

కెలికే, లేండిగూడ మధ్యలో కల్వర్టు పూర్తిగా తెగిపోయింది. సుమారు 200 మీటర్ల వరకు ఉన్న తారు రోడ్డు ఆనవాళ్లు కోల్పోయింది. ఎక్కడిక్కడ కంకర తేలి, రాళ్లురప్పలు, బయటికి కనిపిస్తుంటే..అక్కడక్కడ గుంతలు పడి నడక నరకంగా మారింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో వేసిన బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. ప్రస్తుతం నడిచేందుకు వీలు లేకుండా ఉంది. ఆ రోడ్డుపై నాలుగైదు మూలమలుపులు ఉన్నాయి. ఇక్కడ బైక్‌లు అదుపుతప్పిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఆ గ్రామాల వైపు వెళ్లేందుకు ప్రయాణికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### ఇబ్బందిగా ఉంది



రోడ్డు ఛిద్రంగా మారడంతో నడచేందుకు కష్టమవుతుంది. కంకరరాళ్లపై బైక్‌లు అదుపుతప్పుతున్నాయి. వాహనదారులు కింద పడి గాయాలపాలవుతున్నారు. వానాకాలంలో కల్వర్టు వద్ద నీరు నిండి ఉంటుంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

– హడ్పే బాజీరావు, ఇంద్రానగర్

### అధికారుల దృష్టికి తీసుకెళ్తా..



లేండిగూడ తదితర గ్రామాల వైపు వెళ్లే తారు రోడ్డు మరమ్మతు విషయమై కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి దృష్టికి తీసుకెళ్తా. రోడ్డు మరమ్మతు నిధుల కోసం సిఫారసు చేస్తా. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– అంజద్‌పాషా, ఎంపీడీవో, కెరమెరి

# అసంపూర్తిగా బీటీ రోడ్డు



పెంచికల్‌పేట్‌లో ఇటీవల వేసిన బీటీ రోడ్డు

- నిధుల లేమితో నిలిచిన పనులు
- పూర్తయిన సగం రోడ్డు
- బురదతో ప్రజలకు తప్పని ఇక్కట్లు

పెంచికల్‌పేట్: ఎల్లూర్ ప్రధాన రహదారి నుంచి పెంచికల్‌పేట్ మీదుగా కొమ్ముగూడ వరకు నిర్మించిన బీటీ రోడ్డు పనులు నిధుల కొరతతో అసంపూర్తిగా నిలిచిపోయింది. గ్రామానికి పక్కా రోడ్డు లేక దశాబ్దాల కల నెరవేరుతుందని ఆశగా చూసిన గ్రామస్తులకు నిరాశే మిగిలింది. మిగిలిపోయిన రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

**గతేడాదిలో పనులు..**

బీఆర్ఎస్ హయాంలో గతేడాది ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప.. ఎల్లూర్ ప్రధాన రహదారి నుంచి కొమ్ముగూడ వరకు రూ.65 లక్షలతో బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కాంట్రాక్టర్ ఈ పనులు ప్రారంభించలేదు. గత మూడు నెలల క్రితం పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్.. మూడు కల్వర్టులతోపాటు 865 మీటర్ల బీటీ రోడ్డును మాత్రమే వేశాడు. కొమ్ముగూడ వరకు మరో 300 మీటర్ల బీటీ వేయాల్సి ఉన్న నిధులు లేక పనులు నిలిపివేశాడు. దీంతో సగం రోడ్డు మాత్రమే పూర్తయిందని బురద కష్టాలు తీరేలా లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నిధులు మంజూరు చేయాలి



నిధులు లేవని కాంట్రాక్టర్ సుమారు 300మీటర్ల రోడ్డు వేయలేదు. గ్రామానికి ఓ వైపు రోడ్డు నిర్మాణం పూర్తయి మరోవైపు మిగిలిపోయింది. అసంపూర్తి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– పాముల వెంకటి, పెంచికల్‌పేట్

### నిరాశే మిగిలింది



గ్రామానికి రోడ్డు నిర్మాణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో సంతోషపడ్డాం. కాంట్రాక్టర్ నిధుల లేమితో పనులు నిలిపివేశారు. బురదతో మళ్లీ కష్టాలు తప్పేలా లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేయాలి.

– కుమ్మరి సురేష్, పెంచికల్‌పేట్

## గ్రామాలకు పోలీసు అధికారులను నియమించాలి



వందనం స్వీకరిస్తున్న డీఎస్పీ రామానుజం

చింతలమానెపల్లి: అన్ని గ్రామాల్లో పోలీసు అధికారులను నియమించాలని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా చింతలమానెపల్లి పోలీసుస్టేషన్‌ను ఆదివారం తనిఖీ చేశారు. వివిధ నేరాల్లో పట్టుబడి ఉన్న వాహనాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి కేటాయించిన విధులను తెలుసుకున్నారు. రికార్డులు, నమోదైన కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో పొందుపర్చాలన్నారు. పెండింగ్ కేసులపై డీఎస్పీ సమీక్ష నిర్వహించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నమోదైన సైబర్ నేరాల వివరాలను పరిశీలించారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లతో మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో అన్ని రకాల విధులను నేర్చుకోవాలన్నారు. ఎస్సై ఇస్లావత్ నరేశ్, సిబ్బంది ఉన్నారు.

## వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: న్యూఇయర్ సందర్భంగా మండల ప్రజలు, యువత డిసెంబర్ 31న వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై డి.చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం రాత్రి 7 నుంచి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడితే కేసులు నమోదు చేసి బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. అలాగే డ్రగ్స్ టెస్టింగ్ కిట్లతో తనిఖీలు నిర్వహిస్తామని అన్నారు. ట్రిబుల్ రైడింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. వేడుకల పేరుతో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, అక్రమ సిట్టింగ్‌లు, గుంపుల గుంపులుగా సంచారం, మహిళలను వేధించడం వంటి జరగకుండా మఫ్టీ టీమ్స్‌తో గస్తీ నిర్వహిస్తామన్నారు. ఆర్కెస్ట్రా, డీజేలు, మైక్ ఉపయోగించడం, బాణాసంచా వినియోగం నిషేధమని తెలిపారు.

# సమ్మె కొనసాగిస్తాం



సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని సమగ్ర శిక్షా ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక తెలిపారు. కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మె ఆదివారం నాటికి 20వ రోజుకు చేరింది. సమగ్ర శిక్షా ఉద్యోగులు తుకారాం, మోహన్, నగేశ్, సంతోష్, రాజేష్, ప్రశాంత్, మల్లేశ్, రమాదేవి, ధర్మయ్య, ఆనంద్ రావు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న భానుమతి

పాతమంచిర్యాల: అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) అధ్యక్షురాలు భానుమతి కోరారు. జిల్లా కేంద్రంలోని తాపీ మేస్త్రీ భవనంలో ఆదివారం యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అధ్యక్షురాలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క పదేపదే గుడ్‌నైట్ గుడ్ న్యూస్ అంటూ సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తున్నారన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు. వయసు పైబడిన వారికి జీతంలో సగం పింఛన్ ఇవ్వాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌కు ప్రభుత్వం నాణ్యమైన వస్తువులు సరాఫరా చేయాలని, ఆన్‌లైన్‌లో, యాప్‌లో రిపోర్టింగ్ పంపించే విధానం రద్దు చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా భవనాల అద్దెలు, మెనూ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అబ్బోజు రమణ, కార్యదర్శి దుంపల రంజిత్, మాజీ జిల్లా కార్యదర్శి సంకెరవి, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అనురాధ, నాయకులు సత్యవతి, శంకరమ్మ, విజయలక్ష్మి, సబిత, శారద, ప్రవీణ, లావణ్య, దాసరి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఊరెళ్తే ఊడ్చేస్తారు..!

- ఇళ్లకు తాళం వేస్తే అంతే సంగతి
- జిల్లాలో దొంగల దండయాత్ర
- ఇటీవల వరుసచోరీలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



కౌటాలలో చోరీ ఘటన తీరును పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

కౌటాల: ప్రతి ఒక్కరూ పండుగ సెలవులు, శుభకార్యాలను సంతోషంగా గడపాలని అనుకుంటారు. కొందరు స్థానికంగా ప్రయాణాలు చేస్తారు. మరికొందరు దూరప్రాంతాలకు వెళ్తుంటారు. దీన్ని ఆసరా చేసుకున్న దొంగలు చెలరేగుతున్నారు. ఇళ్లల్లో ఉన్నదంతా ఆపహరించి గుల్ల చేస్తున్నారు. పట్టపగలే దోపిడీలకు పాల్పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నా చోరీలు ఆగడం లేదు. మండల కేంద్రాల్లో సీసీ కెమెరాలు పనితీరు సక్రమంగా లేకపోవడంతో దొంగలు తమ పని సులువుగా కానిచేస్తున్నారు.

**ఏటా దొంగతనాలు**

జిల్లాలో నిత్యం ఎక్కడో ఓచోట చోరీలు జరుగుతూనే ఉన్నాయి. గత మూడేళ్లలో 190 చోరీలు జరిగాయి. ఈ ఏడాది 50 దొంగతనం కేసులు నమోదయ్యాయి. జిల్లాలో దుండగులు పగలు పలు కాలనీలు తిరిగి రెక్కీ నిర్వహిస్తారు. తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా అదేరోజు రాత్రి తాము గుర్తించిన ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. దొంగలకు పాల్పడిన వారిని గుర్తించి వారిని పట్టుకుని సొమ్ము రికవరీలో పోలీసులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కౌటాల మండల కేంద్రానికి చెందిన పందిర్ల శ్రీనివాస్ ఇంట్లో దొంగలు చొరబడి రూ.70 వేల నగదుతోపాటు 30 తులాల వెండి, 3 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. శ్రీనివాస్ మహారాష్ట్రలోని హాస్పిటల్‌కు వెళ్లడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు.

**వరుస చోరీలు..**

అసలే రానున్నది సంక్రాంతి పండుగ..అందులో వరుస సెలవులు..ఇంటిళ్లపాది పండుగకు, శుభకార్యాలు, విహారయాత్రలకు వెళ్లేందుకు సిద్ధమవుతుంటారు. అయితే మీరు ఇళ్లకు తాళం వేసి శుభకార్యాలకు వెళ్లితే వచ్చేలోపు ఇళ్లను దొంగలు గుల్ల చేసే ప్రమాదం ఉంది. ఇటీవల కాగజ్‌నగర్, కౌటాల మండలంలో చోరీలతో మండలవాసులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, కౌటాల మండలాల్లో అధికంగా దొంగతనాలు జరుగుతున్నాయి. సమీపంలోనే సరిహద్దులో మహారాష్ట్ర ఉండడంతో దొంగలు రైలుమార్గంలో.. అంతర్రాష్ట్ర రహదారుల వెంబడి రాష్ట్ర దాటేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నేరాల నియంత్రణకు మండలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. అందుకు అడుగులు ముందుకు పడడం లేదు. తరచూ పోలీస్ పెట్రోలింగ్, తనిఖీలు, కార్డన్‌సెర్చ్ నిత్యం కొనసాగుతున్నా అందరి కళ్లుగప్పి చోరీలకు పాల్పడుతున్నారు.

### పోలీసుల సూచనలు ఇలా..

- న్యూఇయర్, సంక్రాంతి సెలవుల్లో ప్రజలు ఊళ్లకు వెళ్లాల్సి వస్తే బంగారం, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలి. ఇంటికి సెంట్రల్ లాక్‌సిస్టమ్ గల తాళం పెట్టుకోవాలి.
- చాలారోజులు తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే స్థానిక పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.
- ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలి.
- మెయిన్ డోర్‌కు తాళం వేసినప్పటికీ అవి కనిపించకుండా కర్టెన్స్‌తో కవర్ చేయాలి.
- బయటకు వెళ్లేటప్పుడు ఇంటి లోపల, బయట కనీసం కొన్ని లైట్లు వేసి ఉంటే మంచిది.
- బంగారు ఆభరణాలు వేసుకొని ఫంక్షన్, గుడికి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయవద్దు.
- ఎవరైన అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. 100 నంబర్‌కు తప్పనిసరిగా ఫోన్ చేయాలి.

## ఫిబ్రవరి 9న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఫిబ్రవరి 9న నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్‌రావు తెలిపారు. పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల ప్రారంభం నుంచి 2023–24 బ్యాచ్ వరకు విద్యార్థులు పాల్గొంటారని వివరించారు. ఇప్పటి వరకు 200 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఈ మహాసమ్మేళనం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సాయిని సంతోశ్, అధ్యక్షుడిగా గద్దెలపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా వాసుదేవన శైలేష్, ముత్యాల ప్రదీప్, కార్యదర్శిగా ఇరుకుల్ల శ్రీనాథ్, సహా కార్యదర్శులుగా పోలంపెల్లి రాజశేఖర్, ఫుల్లూరి సంతోశ్, కల్లూరి సంతోశ్, కోశాధికారిగా జంజిరాల సతీశ్, ప్రచారకర్తగా కలకుంట్ల శ్రీధర్, సలహా సమితి కన్వీనర్‌గా కొడిప్యాక వేణుగోపాల్, నాగుల శ్రీనివాస్, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా తాటిపెల్లి జ్యోతి ఎన్నికయ్యారు. కన్వీనర్‌గా పూర్వ ఆచార్యులు చందావార్ బాలేశ్వర్ వ్యవహరిస్తారు.

### అదుపుతప్పి లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ సమీపంలో హీన కాటన్ మిల్ వద్ద ఆదివారం రాత్రి లారీ అదుపుతప్పి బోల్తాపడింది. మహారాష్ట్ర నుంచి ఆంధ్రప్రదేశ్ కోళ్ల మేత లోడ్‌తో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కా లేదు.